# నిరీక్షించిన నళిని

తెల్లారింది. సూర్యకాంతి గదిలోకి ప్రసరిస్తూంది నళిని హృదయంలో కూడా ఉదయం అయింది లగాయితు ఏదో అనిర్వచనీయమైన ఆనందం ఉబుకుతోంది. పక్కమీదినుంచి లేస్తూనే నవ్వుకుంటోంది. ఇలా ఉదయానికి ఉదయం నిద్ర నుండి లేస్తూ తనలోతాను మురిసిపోయే నళిని వైఖరికి ప్రభ విస్తుపోయింది. "ఏమి టది నళినీ!" అంది. 'ఏం లే' దంది నవ్వుతూ. ఆవులించి వళ్ళు విరుచుకుని లేచినిల్చుంది. నళిని ఏవేవో మధురస్వప్నాల్లో తేలియాడుతున్నదని ప్రభ తెలుసుకోలేకపోయింది.

రోజూకంటె నళిని సంతోషంగా వుంది. కాలకృత్యాలు ముగించుకొని తొరతొరగా స్నానంచేసి చీరె మార్చుకుంది. అద్దంముందు కూచొని శ్రద్ధగా అలంకరించుకుంది. రోజూటివలె గాకుండా ఇవ్వాళ ఇలా ఈరకంగా తయారవటంలో ఏదో విశేషముందని అనుకున్నదేగాని అదేమిటో ప్రభకు తెలీదు. తెలుసుకునేందుకు కావలసినంత అనుభవం కూడా ప్రభలో లేదు. ప్రభ ఇంటర్ ప్యాసై 'మెడిసిన్' మొదటి సంవత్సరంలో చేరింది. నళిని థర్డ్‌యియర్ యం. బి. చదువుతోంది.

బయటికి వెళ్ళబోతూ నళిని 'ప్రభా! నే నోగంటలో వచ్చేస్తాను' - అంది. మోరిస్ స్ట్రీట్‌లో వున్న తన స్నేహితురాలియింటికి వెళ్ళిందిగాబోలని ప్రభ అనుకుంది. గాని నళిని వెళ్ళింది 'కృష్ణనగర్'కు దగ్గర్లోకే. అక్కడే చంద్రునివాసం.

చంద్రం 'బి. యి. ఫైనలియర్' చదువుతున్నాడు. నళిని రావటంచూచి చప్పున ముందుకొచ్చి, లోనికి రమ్మని ఆహ్వానించాడు; ఆ కబుర్లూ ఈ కబుర్లూ మాట్లాడుకున్నారు. ఒకరినొకరు పరామర్శించుకున్నారు. అవతలగా పెట్టెప్రక్కన వున్న ఫిడేలుచూసింది నళిని. 'చంద్రం! వైలెన్ వాయించవూ!' అంది. చంద్రం నవ్వుతూ తాగేతాగే సిగరెట్ ఆఖరుసారి ఒక పీల్పుపీల్చి అవతల పారేసి ఫిడేలు కమాన్ పుచ్చుకున్నాడు. మధురగానం ఒలికొలికి పోయింది. చంద్రం హిందోళం అతి చక్కగా వాయిస్తాడు. వాయిస్తున్నంతసేపూ చంద్రం నళిని మొహంలోకి చూస్తూ వుండిపోయాడు. నళిని అతని అందానికీ, అతను వినిపించిన సంగీతానికీ ముగ్ధురాలై పోయింది. మాట పెగిలిరాలేదు. ఆశలు చిగురిస్తున్నాయి.

గదికొచ్చేసింది. ప్రభా తనూ కలిసి 'మెస్' లో కెళ్ళి భోజనం చేశారు. మళ్ళా గదికొచ్చి పుస్తకాలు తీసుకొని పదిన్నరకు కాలేజీకి వెళ్ళారు. భోజనందగ్గిరా, గదికొచ్చి పుస్తకాలు తీసుకొన్నప్పుడూ, కాలేజీకి వెళ్ళే దారిలో చంద్రం గుర్తుకొచ్చాడు నళినికి. అప్రయత్నంగా నవ్వుకుంది.

నళిని క్లాస్‌లో కూచుంది. ఎదురుగా ఒక ప్రక్కన రావు కూచున్నాడు. వెనక్కి దువ్వుకున్న 'వేవ్‌డ్ హేర్', ఎత్తయిన ఫాలభాగం, అప్రయత్నంగా ఆకర్షించే మొహం. 'ప్రీ రెజిస్ట్రేషన్' దగ్గర్నుంచీకూడా నళినికి అతనంటే ఇష్టం. నళినికి రావు తనవేపే చూస్తూంటే ఏదో తెలియని ఆనందం పరవళ్ళు తొక్కేది. ఈరోజుకూడా అలాగే చూస్తున్నాడు. నళినిలో ప్రేమ పొంగింది.

క్లాస్ అయ్యాక రావును కలుసుకుంది— 'సర్జికల్ ఎనాటమీ' నోట్సు యివ్వమని అడిగింది. మాట్లాడేందుకు ఇదొక సాకు మాత్రమే.

ఒంటరిగా నిల్చొని అరగంటసేపటివరకూ మాట్లాడుకుంటూనే వున్నారు - ఏవేవో పిచ్చాపాటీను. విషయాలేమీ లేకపోయినా సంభాషణ అనర్గళంగా గంటలకొలదీ సాగిపోతుంది— ఇలాంటి తొలిరోజుల్లో! అయితే టైం లేకపోవటంవల్ల ఇద్దరూ ఎవరి దారిన వాళ్లు వెళ్ళిపోయారు.

రోజూ ఉదయం కాలేజీ టైం వరకూ నళిని క్రిష్ణనగర్‌కు వెళ్ళేది. రూంమేట్‌గా వుంటున్న ప్రభ మోరిస్ స్ట్రీట్‌కు వెళ్ళిందని తలచేది. కాని రోజూ నళిని చంద్రం వైలెన్ మీద వాయించే 'హిందోళం' వినేందుకు వెళ్తున్నదని - ప్రభకు తెలియదు. ఆ సంగీతం వింటున్నకొద్దీ ఆమెలో ఎన్నెన్నో భావాలు పనిచేస్తుండేవి. ఆ భావాలుకూడా 'హిందోళం' అంత మధురమైనవి! "ఈ భావాలు విన్నరోజు చంద్రం హృదయం నిండిపోతుంది. ఆనందాతిరేకంతో భావాల్ని 'యాక్సెప్ట్' చేస్తాడు" - అని నళిని తలచేది.

ఎన్నో ఉదయాలు గడచిపోయాయి. ప్రభకు అసలు రహస్యం తెలీదు. ఓరోజున అనుకున్నది-పరీక్షలు దగ్గరకొచ్చినా చదువదేమా అని! ఇలా అని అడిగే సాహసం ప్రభలోలేదు. కాని ఆ తరువాత ఇలా అనుకుంది - నళిని మారిస్ స్ట్రీట్‌లో వున్న తన స్నేహితురాలి దగ్గరకు చదువుకుందికి వెళ్తోందని.

కాలేజీ నాలుగ్గంటలకి అయిపోతే ఐదూ ఐదున్నర వరకూ ఎక్కడికి వెళ్ళావని ప్రభ ఏరోజునా అడగలేదు. ఆ

సమయంలో నళిని ఎక్కడికి వెడుతుందో, ఏం చేస్తుందో ప్రభకు తెలీదు. ఒకవేళ ఐదింటివరకూ రావుతో మాట్లాడుతూ వచ్చిందని తెలిసినా ఏమీ అనుకోదు. అయితే ఇలా రోజూ జరుగుతున్నదీ అని తెలిస్తేమాత్రం ఎన్నోన్ని అనుకునే వుండేది! ఒకరోజూ... రెండు రోజులూకాదు, వారాలు, నెలలూ గడిచిపోతున్నాయి. పశ్చిమాన సూర్యుడు కుంగుతూ గులాబీరంగు పూసుకున్న ఎన్నో అందమైన సాయంత్రాలు నెలలుగా మారినా ఈ విషయం ప్రభకు తెలీక, పైపెచ్చు కోర్సుకు సంబంధించిన విషయాలు చర్చిస్తూ తన స్నేహితురాండ్రతో వుండి వుంటుందని ప్రభ నమ్మింది.

రోజూ వలెనే నళిని ఉదయమే లేచింది. రోజూవలెనే నవ్వుతూ లేచి కాలకృత్యాలు ముగించుకొని అద్దంముందు కూచుంది—ఏవేవో అనుకున్నది. ఈరోజు చంద్రానికి చెప్పెయ్యాలనుకున్నది—అతన్ని తాను ప్రేమిస్తున్నట్లు. మరు నిమిషంలో ఈరోజు తను వెళ్ళకుండా ఒక ఉత్తరం రాద్దామనుకుంది. గబగబా లేచి కలం కాగితం తీసుకుంది – 'డియర్ చంద్రం! నేను నిన్ను ప్రేమిస్తున్నా...' అని రాసి ఆగిపోయింది. 'ఒక స్త్రీ తొందరపడి తన అంతర్యాన్ని తెలుపకూడదు. పురుషుడు స్త్రీనిచూచి భావాల్లోకరిగి ఏదో రోజున తన ప్రేమను వెల్లడిస్తాడు. తన్నువివాహమాడతావా అని అడుగుతాడు. ఆ ముహూర్తంకోసమే ఎదురుచూస్తున్న స్త్రీ వెంటనే తన స్వీకారాన్ని తెలుపుతుంది. అప్పుడే ప్రేమసాఫల్యం చేకూర్చుకుంటుంది' అని అనుకున్నది. కాగితం చించేసింది. నిజంగా తన వివాహం చంద్రంతో

అయితే ఎంత బావుంటుంది! అతను ఇంజనీరు, తను డాక్టర్ - జీవితం హాయిగా గడిచిపోతుంది—అని అనుకున్నది. ఒక్కసారిగా లేచి బెడ్ మీద పడుకుంది. ఆ సమయంలో ప్రభ గదిలో వుండివుంటే ఆ భావాల్లో వూగిపోయే వైఖరికి తప్పక కారణం అడిగివుండేది.

సరిగా భోజనంవేళకి ప్రభ వచ్చింది. ఇద్దరూ కలిసి కాలేజీకి వెళ్లారు. రావు కన్పించాడు. ఎందుకో ఇవాళ రావునుచూడగానే భయంవేసింది. ఒక్కసారిగా తను ఉదయం ఆలోచించిన విషయాలు స్మృతిపథంలో తారట్లాడినాయి. లేచి 'గరల్స వెయిటింగ్‌రూం' లోకి వెళ్ళింది. ఆలోచనా పరంపరలు లేస్తూ పడుతూ ఉన్నాయి. 'నేను చంద్రాన్ని ప్రేమించను. అతన్ని వివాహమాట్టం నాకిష్టంలేదు. అతను ఇంజనీరు అవుతాడు. నేను డాక్టర్ని! కార్యక్షేత్రాలు వేరవటంచేత మా దాంపత్యంలో అవాంతరం వాటిల్లుతుంది. నేను రావుని ప్రేమిస్తున్నాను. అతనితో నా వివాహమయితే జీవితంలో వెలితి అనేది వుండదు. అతనే నేను, నేనే అతనై డాక్టర్లంగా మంచి పేరును సంపాయించుకుంటాం. మా దాంపత్యానికి లోకం వెన్నెలహారతు లిస్తుంది. ఒకే క్షేత్రానికి సంబంధించిన మా దాంపత్యం కలకాలం నిలిచివుంటుంది- ఇలా ఎన్నో వూహల దోనెల్లో నళిని తేలియాడుతూనే వుంది. అఖరికి క్లాసుకు వెళ్ళకుండానే గదికి వెళ్ళిపోయింది.

గదికి రావటంతోటే ఉదయం 'డియర్ చంద్రం... నిన్ను నేను ప్రేమిస్తున్నా'నని రాసి చించేసిన చిన్నచిన్న కాగితాలు కన్పించాయి. వాటిలోనుంచి చంద్రం అందమైన

ముఖబింబం కనిపించి—'నళినీ! నిన్ను ప్రేమిస్తున్నా!' అని చెప్పినట్లుగా తోచింది ఒక్కసారిగా తనలో సంకుల సమరం చెలరేగింది. కొంచెంకుదుటబడ్డాక—ఒక్కసారి చంద్రంమీదికి దృష్టిపోనిచ్చింది, అంతలోకే అతని 'హిందోళం' స్మృతికొచ్చి హాయిని చేకూర్చింది—ఎండ కాసి కాసి ఆపైన వర్షం పడినప్పుడు భూమిలోనుంచి వచ్చే వాసనలా 'అతను ఇంజనీరుఅవుతాడు. నేనుడాక్టర్ని. అతనిఅనుభూతులు, నాఅనుభూతులుఏకమైఒకరొకరి జీవితమైనిత్యంకొంగొత్తవిషయాల్ని చర్చించుకుంటూ నాఅనుభవాన్ని అతనికి, అతనిఅనుభవాల్ని నాకూ పరస్పరం చెప్పుకొన్నాక ఏర్పడ్డ దాంపత్యం ఒక నూతన జగత్తుకు ప్రాతిపదిక అవుతుంది. యావత్తు జీవితం ఒకే రకమైన ఒరవడిలో రాపిడవుతూ—ఎప్పుడూ హాస్పిటల్... జబ్బులు...రోగులు ... మందులు - ఇంకో మాట లేకుండా వీటిల్లోనే నా జీవితాన్ని గడుపుకోవటమంత హేయమైంది మరొకటుండబోదు. నేను రావును ప్రేమించలేను. అతను నా స్నేహితుడు మాత్రమే. అంతే!' అనుకుంది.

ఆ రెండురోజులూ నళిని చంద్రాన్ని కలుసుకోలేదు. మూడోరోజున వెళ్ళేందుకు తయారై వాకిట్లోకి వచ్చేటప్పటికి- చంద్రం కనిపించాడు. ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. అతనిక్కడికి రావడం నళినికిష్టంలేదు. కారణం ఈవాళ నళిని తన హృదయాన్ని విప్పి చంద్రంముందు వుంచాలని తీర్మానించుకుంది. వచ్చిన మనిషిని వెళ్ళమని ఎలా అనడమా అని అనుకొని లోనికి ఆహ్వానించి కుర్చీలో కూచోమంది రాగానే. చంద్రం గది నలువేపులా చూచి ప్రభ మెల్కు, బెడ్డింగు

వున్నవేపు చూసి 'ఆమె ఎవర'న్నాడు. 'ఫస్టియర్, ప్రభ; ప్రక్క రూంలో వుంద'ని చెప్పింది.

'నళినీ ! మా పరీక్షలు నిన్నటితో అయిపోయాయి. ఈ రోజు మధ్యాహ్నం బండికి ఇంటికి వెళుతున్నాను. ఉదయం మా నాన్న - ఇంకో వూరు వెళ్ళి వస్తూ ఇక్కడ దిగాడు. నీదగ్గరకు నేనే రావటం బావుంటుందనివచ్చాను. పైగా వెళ్ళబోయే ముందు నీగది చూచినట్టుకూడా వుంటుంది. ఇంటికి వెళ్ళగానే ఉత్తరం రాస్తాను. సమాధానం రాస్తావుకదూ!' ఇవీ చంద్రం పలికిన మాటలు.

నళినిహృదయంలో ఒక్కసారిగా అగ్నిపర్వతం ప్రజ్వరిల్లినంత పనయింది. ఏం చెప్పాలో తనకే తోచలేదు. తాను చెప్పాల్సిన విషయం ఒక్క నిమిషంలో పూర్తయ్యేదికాదు. ఇది హాస్టల్. ప్రక్కనే ప్రభ వుంది. అతనిగదికి వెళ్ళి చెప్పేందుకూ వీల్లేని పరిస్థితి.

దించుకపోయిన నళిని మొహం చూచి చంద్రం - 'నళినీ ! నామట్టుకు నేను ఇప్పుడు వెళ్ళివుండేవాణ్ణి కాదు. కాని నాన్న వచ్చాడు. వెళ్ళక తప్పదు. ఉత్తరాల్లో కలుసుకుంటూనే వుంటాం, మరి వెళ్ళొస్తా!" అని చంద్రం లేచాడు. లేనిపోని నవ్వు తెచ్చుకొని 'మంచిది చంద్రం !' అన్నది.

చంద్రం వెళ్ళిపోయాడు—తనఆశలు మంటగలిపి! తన హృదయాన్ని గాయపరిచి ! తను ఏ ముహూర్తంకోసం కాచుకొనివుందో ఆ సమయాన చంద్రం నిరాశాసంగీతాన్ని వినిపించి వెళ్ళిపోయాడు. ఇంతకాలమూ తను అలలుగా కలలు కన్నది ! కాని, తాను మైకంలో వున్నాననీ, భావనా

తరంగాల్లో తేలియాడుతున్నాననీ అనుకోక పైపెచ్చు చంద్రమే తన ఆశలు భగ్నం చేశాడని అనుకుంది—దానికి కారణం తను కాక చంద్రమే అయినట్లు!

పురుషుడు స్త్రీని చూచి భ్రమపడి ఆ మరుక్షణాన ఆమెతో 'నిన్ను ప్రేమిస్తున్నా' నని అంటాడని నళిని తల పోసింది కాని అలా జరుగలేదు. తనే అడుగుదామని ఆయత్త మయేటప్పటికి ఆ అవకాశంకాస్తా చేజారిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. నళిని క్లాసుకు వెళ్లుతోంది కాని రావువేపుకు చూడలేకపోతోంది. ఏదో తెలియనిదుఃఖం హృదయాన్ని ఆవరించి తన్ను భయపెడుతూవుండేది. వెనుకటిలా రావుతో మాట్లాడటం మానేసింది. రావుకూడా అలాగే దూరదూరంగా వుంటున్నాడు. ఇది మరీ కష్టంగావుంది. ఓరోజు తన అందాన్ని ప్రశంసించిన రావు ఇప్పుడు తనవేపు కూడా చూడకపోవటం ఆమె భరించలేకపోయింది. కాని చేసేదేముంది!

ఆపైన రావు వరుసగా క్లాసుకు రావటం మానేశాడు. అలా రావు రాకపోవటం తనకు హాయిగాతోచింది. మళ్ళీ వెనుకటిలా అందరితో నవ్వుతూ, సంతోషంగా కాలాన్ని గడపసాగింది.

ఇలాంటి రోజుల్లో నళిని వెయిటింగ్‌రూంలో కూచుని వుండగా లెటర్‌బాక్సులో తన పేరుతో ఒకఉత్తరం చూచింది. గబగబా లేచి తీసుకొని చూచింది. చంద్రానిది. అతనివివాహ మట. ఆరోజున వాళ్ళ నాన్నతో ఇంకో ఆయనకూడా వచ్చాడట-ఆయన కూతుర్నే. కట్నం ఏభైవేలు. చదవలేక

పోయింది. ఆఉత్తరాన్ని చించి ముక్కలుముక్కలు చేసి అవతల పారేసింది. ఒక్కసారిగా బిగ్గరగా 'నే నసలు పెళ్ళే చేసుకోను.' అని అనుకుంది.

క్లాసులో కూర్చున్నదేగాని ప్రొఫెసర్ చెప్పేది తనకేమీ అర్థమవటంలేదు. ఎందుకో రావు గుర్తొచ్చాడు. రావు చాలామంచివాడు. అతన్ని నే నర్థంచేసుకోటంలో పొరపాటుంది అని మొదటిసారిగా అనుకున్నది. ఇలా అనుకోటం తన వ్యక్తిత్వానికే భంగమని ఆమె అనుకోనేలేదు. అదే ఆమె ఓటమి.

క్లాసునుంచి బయటికి వచ్చేప్పటికి—రావు తన స్నేహితులతో మాట్లాడుతున్నాడు. తప్పుకుపోతున్న నళినిని రావు పేరుపెట్టి పిలిచి 'ఒకవిషయం వింటావా' అన్నాడు. ఏమిటంది నళిని. 'వచ్చే శనివారం నా వివాహం. ఆ సందర్భంలో మన కాలేజీవాళ్ళు చాలామంది వస్తారు. వాళ్ళతోపాటు నీవు కూడా రావాలి' అన్నాడు. నళినికి రావు ఏం చెబుతున్నాడో వినిపించలేదు. ఆమెలో ఏదో భయానకభావం పరవళ్ళుతొక్కింది. ఇంటికి వెళ్ళి పక్కమీద పడుకుంది. అప్రయత్నంగా ఏడ్చింది. అలాగే నిద్ర వచ్చేసింది. నిద్రనుండి లేచేప్పటికి కిటికీలోగుండా దూరంగా పడమటిసముద్రంలో ఎర్రగా 'డేంజర్ లైట్'లా సూర్యుడు కన్పించాడు.

ఆ సమయంలో ప్రభ గదిలోకి ప్రవేశించి "నళినీ! రావుకి పెళ్ళట. వచ్చే శనివారం జరుగుతుందట. వెళదాం వస్తావా!" అంది.